క్లుప్తంగా

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

పెనమలూరు: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్ ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు శిబిరంపై దాడి చేశారు. వీరి దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.9,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసు

పెనమలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించిన పలువురు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని యనమలకుదురు, కానూరు, పోరంకి ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద కోళ్లు, కత్తులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

నేడు మండల పరిషత్ సాధారణ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని వివిధ శాఖల ప్రగతిపై సమీక్ష జరుగుతుందన్నారు. సకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

బల్లిపర్రులో పశువైద్య శిబిరం

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి శివారు బల్లిపర్రు గ్రామంలో మంగళవారం కృష్ణా మిల్క్ యూనియన్, ఎన్టీఆర్ పశువైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ సరైన యాజమాన్య పద్ధతులతో పశువులకు సకాలంలో చికిత్స అందించాలని, సంవత్సరానికి ఒక దూడ పుట్టేటట్లు చూసుకోవాలని రైతులకు సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, నరేంద్రనాథ్, పశుసంవర్ధక శాఖ ఏడీఏ కె.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు. శిబిరంలో 15 సాధారణ, 6 శస్త్ర చికిత్స, 85 గర్భకోశ వ్యాధుల పశువులను పరీక్షించి జీవాలకు నట్టల నివారణ మందులు అందజేశారు.

నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలపై చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన నూతనంగా నిర్మించిన భవనాన్ని ఏపీ సీఆర్‌డీఏ అధికారులు మంగళవారం ధ్వంసం చేసేందుకు చర్యలు చేపట్టారు. భవన నిర్మాణానికి సీఆర్‌డీఏ అనుమతి ఉన్నప్పటికీ నిబంధనలు అతిక్రమించారనే అభియోగంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ భవనం నిర్మించారని ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేయటంతో సీఆర్‌డీఏ అధికారులకు న్యాయమూర్తి ఇచ్చిన ఆదేశాల మేరకు భవనాన్ని ధ్వంసం చేసేందుకు యంత్రాలతో సహ అధికారులు ఇక్కడికి చేరుకుని పనులు ప్రారంభించారు. అయితే భవన యజమాని కోర్టును ఆశ్రయించటంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.

పాండురంగ స్వామి ఆలయంలో భజనలు

మచిలీపట్నంటౌన్: స్థానిక చిలకలపూడిలోని పాండురంగస్వామి ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా అల్లవరం మండలం కొమనగిరిపట్నానికి చెందిన భక్తులు మంగళవారం విచ్చేశారు. గ్రామంలోని ప్రహ్లాదబాబా ఆశ్రమానికి చెందిన వీరు పాండురంగస్వామి ఆలయానికి విచ్చేసి పాండురంగస్వామి కీర్తనలు, కృష్ణుడిపై పాటలు, భజనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు వాణీకృష్ణ, ఆదిరెడ్డి, బుచ్చిబాబు, లక్ష్మణరావు, ఈశ్వరరెడ్డి, సూరిబాబురాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జంఝాటానికి చెక్

- యనమలకుదురు లాకుల వద్ద కొత్త వంతెన
- నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదనలు
- వంతెన డిజైన్ ఇవ్వనున్న నీటిపారుదల శాఖ


యనమలకుదురు లాకులు


లాకులపై ఇరుకైన రోడ్డు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురు లాకుల వద్ద ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే చెక్‌పడనుంది. ఇక్కడ మరో వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు చేశారు. నీటిపారుదల శాఖ ఇచ్చే డిజైన్‌ను ఆమోదించిన తరువాత వంతెన నిర్మాణం ప్రారంభంకానుంది.

పెరిగిన ట్రాఫిక్

బ్రిటీష్ పాలనలో యనమలకుదురు వద్ద బందరు కాలువ, కేఈబీ కాలువ కాలువలు మీదుగా లాకులు నిర్మించారు. గ్రామ ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలుగా లాకుల మీదుగా రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ గ్రామం విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉండటంతో కొన్నేళ్లుగా నివాసాలు భారీగా ఏర్పాడ్డాయి. దీంతో యనమలకుదురు గ్రామ జనాభా 60 వేలను దాటింది. దీంతో వాహనాల ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. యనమలకుదురు నుంచి విజయవాడ రావటానికి ఇప్పటికే పాత పంచాయతీ రోడ్డులో కొన్నేళ్ల క్రితం వంతెన నిర్మించారు. మరో ఫుట్ బ్రిడ్జి కూడా అందుబాటులో ఉంది. అయినా ట్రాఫిక్ సమస్య తీరకపోవడంతో బందరు కాలువపై ఆరేళ్ల క్రితం వంతెన నిర్మాణం చేపట్టినా అది పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన నిర్మాణాన్ని కూడా పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొత్తగా మరో వంతెన నిర్మించనుంది.

కొత్త వంతెనకు ప్రతిపాదనలు

యనమలకుదురు గ్రామం తాడిగడప డొంక రోడ్డు వైపు బాగా విస్తరించింది. డొంకరోడ్డు నివాసితులు విజయవాడకు వెళ్లాలంటే లాకులపై బందరు కాలువను దాటి ప్రయాణించాలి. లాకులు చిన్నవిగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో కొత్తగా వంతెన నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. రూ.5 కోట్లతో వంతెన నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. తాడిగడప మునిసిపాలటీ రూ.2.50 కోట్లు, నీటిపారుదల శాఖ రూ.1.50 కోట్లు, ఎమ్మెల్యే నిధులు రూ.కోటితో వంతెన నిర్మాణం పూర్తి చేస్తారు. ఈ మేరకు అనుమతులతో పాటు డిజైన్ ఇవ్వాలని నీటిపారుదల శాఖకు ఎమ్మెల్యే లేఖ రాశారు. అన్ని అనుమతులు పొందిన వెంటనే వంతెన నిర్మాణం చేపడతారు. త్వరలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏడాది చివరి నాటికి వంతెన పనులు పూర్తి చేస్తారు. వంతెన నిర్మాణం పూర్తి జరిగితే తాడిగడప డొంక రోడ్డు ప్రజలుకు ట్రాఫిక్ సమస్యలు తీరతాయి. లాకులపై ప్రయాణానికీ విముక్తి లభిస్తుంది.

డిజైన్ రాగానే వంతెన నిర్మాణం

యనమలకుదురు లాకుల వద్ద కొత్త వంతెన నిర్మించనున్నాం. నీటిపారుదల శాఖ డిజైన్ సిద్ధంచేస్తోంది. ఇప్పటికే నిధులు కూడా కేటాయించాం. త్వరలో వంతెన నిర్మాణ పనులు చేపడతాం. ఈ ఏడాది చివరి నాటికి డొంకరోడ్డు వాసుల ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తాం.

– ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మునిసిపాలిటీ

పరారైన విద్యార్థి.. గంటల వ్యవధిలో పట్టివేత


విద్యార్థి లియోన్‌ను తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ నుంచి పరారైన విద్యార్థిని హనుమాన్‌జంక్షన్ పోలీసులు గంటల వ్యవధిలోనే పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తితే.. కృష్ణాజిల్లా ఘంటసాల గ్రామానికి చెందిన తరకటూరి లియోన్ (12) వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో ఆరవ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సెలవులు ముగియటంతో మంగళవారం విద్యార్థి లియోన్‌ను తల్లి దుర్గ పాఠశాలకు తీసుకువచ్చి వదిలిపెట్టి తిరిగి స్వగ్రామానికి బయలుదేరింది. మార్గంమధ్యలో ఉన్న ఆమెకు పాఠశాల నుంచి లియోన్ తప్పించుకుని వెళ్లిపోయాడని ఉపాధ్యాయులు ఫోన్‌లో తెలియజేశారు. దీంతో కంగారుపడిన తల్లి దుర్గ హుటాహుటిన బస్సు దిగి హనుమాన్‌జంక్షన్ కూడలి వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సుందరరావుకు తన కుమారుడు పాఠశాల నుంచి పరారైనట్లుగా తెలియజేసింది. వెంటనే ఆయన హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.వెంకటేశ్వరరావుకు సమాచారం అందించారు. ఆయన తన సిబ్బందితో వెంటనే రంగంలోకి దిగి, గాలించగా లియోన్ ఆచూకీ దొరికింది. ఇంటిపై బెంగతో తిరిగి వెళ్లిపోయేందుకు ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్న లియోన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విద్యార్థికి ఎస్ఐ వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తల్లి దుర్గకు అప్పగించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు రాణిగారితోటలోని పిలిప్స్ స్టోర్ వీధిలో నివాసం ఉంటున్న మారుబోయిన గురుబ్రహ్మం కృష్ణలంక, ఫైర్‌స్టేషన్ డౌన్‌లోని ఓ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ప్లాంట్‌కు తాళం వేసి ద్విచక్ర వాహనం తీసుకుని బయటకు వెళ్లాడు. 16వ తేదీన ఉదయం వాహనం ప్లాంట్ వద్ద పార్కింగ్ చేసి ఉంది, కానీ అతను మాత్రం కనిపించలేదు. ఇంటికి కానీ, ప్లాంట్‌కు కాని చేరుకోలేదు. చుట్టుపక్కల, బంధువులను విచారించినా అతని ఆచూకీ లభించలేదు. తన సోదరుడు కనిపించడం లేదని వీరబ్రహ్మం ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ మోకా సత్తిబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానానికి అనుగుణంగా నడుచుకుంటూ, ఆయన ఆశయాలను నెరవేరుద్దామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డెప్యూటీ పోలీస్ కమిషనర్(అడ్మిన్) మోకా సత్తిబాబు అన్నారు. అంబేడ్కర్ యువజన సమాఖ్య(ఏవైఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఆయన ఫకీరుగూడెం కమ్యూనిటీ హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. విద్యతోనే ఏదైనా సాధించగలుగుతామన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారదని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుకోవాలన్నారు. డబ్బు సంపాదించడం ముఖ్యం కాదని, ఉన్నత విద్యావంతులుగా ఎదిగితేనే అంబేడ్కర్ ఆశయాలు సాధించిన వారమవుతామన్నారు. నేడు తాను ఈ స్థితిలో ఉన్నానంటే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సమాఖ్య సభ్యులు నవీన్‌కుమార్, నగేష్, సందీప్, సుధాకర్, వెంకట్ పాల్గొన్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం


కనుల పండువగా సాగుతున్న అమ్మవారి గ్రామోత్సవం

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రామవరప్పాడు పేరంటాలమ్మ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. రామవరప్పాడులో అమ్మవారి గ్రామోత్సవం పూర్తయిన తర్వాత ప్రసాదంపాడు గ్రామంలో ప్రారంభమైంది. ఈ గ్రామోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భారీ సంఖ్యలో పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత పేరంటాలమ్మ ఆలయం నుంచి జాతీయ రహదారి మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం ప్రారంభమైంది. రామవరప్పాడు పుర వీధుల్లో అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ప్రస్తుతం ప్రసాదంపాడులో జరుగుతోంది. రథాన్ని భక్తులు అనుసరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18వ తేదీ సాయంత్రం పేరంటాలమ్మ గ్రామోత్సవం పూర్తవుతుంది. అదే రోజు రాత్రి వంతెన సెంటర్ లోని రైవస్ కాలువలో అమ్మవార్ల తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రథోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుట్టా రామచంద్రరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

డంపింగ్ యార్డులా ఆర్ అండ్ బీ రహదారి


ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త నిల్వలు

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని గన్నవరం–ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా చెత్తకుప్పలతో నిండిపోయి డంపింగ్ యార్డులా తయారైంది. డంపింగ్ యార్డ్ కోసం గత రెండేళ్లుగా గ్రామ పంచాయతీ పాలకవర్గం రెవెన్యూ శాఖకు విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో గ్రామంలో సేకరించిన చెత్తచెదారాన్ని తప్పనిసరి పరిస్థితుల్లో పారిశుద్ధ్య సిబ్బంది ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. గతంలో గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా గొల్లనపల్లి శివారులో రెవెన్యూ శాఖ కేటాయించిన స్థలంలోకి తరలించేవారు. రెండేళ్ల క్రితం పరిసర గ్రామాల రైతులు చెత్త తరలింపును అడ్డుకోవడంతో అప్పటి నుంచి ఆగిరిపల్లి రోడ్డు పక్కన చెత్తను డంప్ చేస్తున్నారు. ఈ అనధికార డంపింగ్ యార్డు నుంచి వచ్చే తీవ్ర దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా చెత్త నిల్వలు తరిగించేందుకు సిబ్బంది నిప్పు పెడుతుండడంతో పరిసర ప్రాంతాల్లో పొగ కమ్ముకుని అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి డంపింగ్ యార్డుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రమశిక్షణకు మారుపేరు పరమేశ్వరరావు


పరమేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా నూతలపాటి పరమేశ్వరరావు నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలు, ఏపీటీఎఫ్ బలోపేతం గురించే ఆలోచించేవాడని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) మాజీ అధ్యక్షుడు ఏ నరసింహారెడ్డి పేర్కొన్నారు. సిద్ధార్థ ఆడిటోరియంలో మంగళవారం నూతలపాటి పరమేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ జరిగింది. నరసింహారెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. ఫెడరేషన్ బలోపేతం కోసం పరమేశ్వరరావు నిరంతరం కృషిచేశాడన్నారు. ఆయన మరణం ఫెడరేషన్‌కు తీరని లోటన్నారు. 1965 సంవత్సరంలో పరమేశ్వరరావు ఏపీటీఎఫ్‌లో చేరిన నాటి నుంచి ఫెడరేషన్ అభివృద్ధిలో భాగం అయ్యారన్నారు. జాతీయ విద్యావిధానం–పర్యావసనాలు అనే అంశంపై నరసింహారెడ్డి మాట్లాడారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ పరమేశ్వరరావు తుది శ్వాస వరకు ఫెడరేషన్ గురించే ఆలోచించారన్నారు. పరమేశ్వరరావు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగానే కాకుండా ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడిగా ఉపాధ్యాయుల కోసం అనేక వ్యాసాలు రాశారని చెప్పారు. ఆయన వ్యాసాలు రాయడమే కాకుండా ఉత్సాహవంతులైన వారితో ఆ పత్రికకు వ్యాసాలు రాయించేవారని గుర్తుచేశారు. ఫెడరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించే కార్యకర్తల కోసం ఆయన నిత్యం అన్వేషణ చేసి, గుర్తించిన వారిని సుశిక్షితులైన సభ్యులుగా తీర్చిదిద్దేవారన్నారు. తొలుత పరమేశ్వరరావు చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు భానుమూర్తి, పాండురంగ వరప్రసాద్, షేక్ జిలానీ, దివికుమార్, సుంకర జ్యోతి, అశోక్‌కుమార్, త్రినాథ్‌తో పాటుగా వివిధ జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అదనపు తరగతి గదులు


పది అదనపు తరగతి గదులతో నిర్మించిన నూతన భవనం



తొమ్మిది అదనపు తరగతి గదులతో నిర్మించిన భవనం

గన్నవరం: శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతున్న భవనాల్లో భయంతో బిక్కు బిక్కుమంటూ చదువుతున్న స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశాలమైన నూతన తరగతి గదులు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 19 అదనపు తరగతి గదులతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చింది. దీనికితోడు దాతల సహకారంతో మరిన్ని అదనపు సదుపాయాలు సమకూరడంతో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువులు సాగిస్తున్నారు. 1965లో స్థాపించిన ఈ పాఠశాలలోని ప్రధాన భవనం నిర్వహణా లోపం వల్ల క్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబ్ కాంక్రీట్ పెచ్చులూడి పడుతున్నప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం కూలిపోయే దశకు చేరుకున్న పాత భవనాన్ని అధికారులు తొలగించారు. క్రీడా ప్రాంగణం పక్కనే సుమారు రూ.1.30 కోట్లు నాబార్డు నిధులతో యుద్ధప్రాతిపదికన పది అదనపు తరగతి గదుల భవనాన్ని నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఆరు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తిచేయడంతో పాటు నాడు–నేడు ఫేజ్–2లో భాగంగా రూ.36 లక్షలతో కొత్తగా మరో మూడు తరగతి గదులను నిర్మించారు. నాడు–నేడులో గతంలో నిర్మించిన భవనాలకు మరమ్మతులు చేసి పెయింటింగ్ వేసే పనులను కూడా చేపట్టనున్నారు. పాఠశాల చుట్టూ పటిష్టవంతమైన ప్రహరీ నిర్మాణం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి వల్ల పాఠశాలకు అదనపు హంగులు సమకూరడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దాతల సహకారం..

పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ ఎం.విజయకుమార్, చిన్ని మాధవి నేతృత్వంలో పలువురు దాతలు విద్యార్థులు భోజనాలు చేసేందుకు పాఠశాలలో డైనింగ్ హాలుతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్, సైకిల్ షెడ్డు నిర్మాణం చేశారు. న్యాయవాది కేవీ రమణ ఆర్థిక సాయంతో పాఠశాల కళావేదిక నిర్మాణం చేశారు. విద్యుత్ ఖర్చులను తగ్గించుకునేందుకు యూనియన్ బ్యాంక్ గన్నవరం బ్రాంచ్ సహకారంతో సోలార్ పవర్ సిస్టమ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఇంటర్మీడియెట్ కోర్సులు కూడా ప్రారంభిస్తాం



ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఇప్పుడు పాఠశాలలో 19 అదనపు తరగతి గదులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మూడు నుంచి పదవ తరగతి చదువుకుంటున్న 635 మంది విద్యార్థులకు తరగతి గదుల కొరత తీరింది. ఇంటర్మీడియెట్ కోర్సులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

–సీహెచ్ అనిత, పాఠశాల హెచ్‌ఎం

రైతు కుటుంబానికి సహాయం

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని చైర్‌పర్సన్ కొలుసు పాములు మంగళవారం అందజేశారు. బ్యాంకులో రుణం పొంది మరణించిన రైతు కూచిపూడి బాబూరావు కుటుంబానికి ఈ సహాయం అందించారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

పెదపారుపూడి: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణ పనులపై అధికారులు అలసత్వం వీడి పనుల్లో వేగం పెంచాలని హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ అధికారులను యాదేశించారు. మండలంలోని వెంట్రప్రగడ, ఈదులమద్దాలి గ్రామాల్లోని జగనన్న కాలనీ లేఆవుట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో నెల్లాఖారులోపు 70 శాతం ఇళ్ల బేసిమెంట్ పనులు పూర్తి చేయాలన్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా ఉంటే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో లబ్ధిదారులకు అవగహన కల్పించాలన్నారు.

- మండలంలోని వెంట్రప్రగడ శివారు పూలవర్తి గూడెంలో ఇళ్ల నిర్మాణ పనులపై డీఆర్‌డీఏ పీడీ శివరాం ప్రసాద్ మంగళవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ వేగవంతం చేయాలన్నారు. బిల్లులు త్వరితగతిన లబ్ధిదారులకు చెల్లిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి శాంతి సందేశం

గుడివాడటౌన్: దేవుని ప్రేమ వ్యక్తి జీవితాన్ని మార్చివేస్తుందని, శాంతి సందేశాన్ని సమాజానికి పంపుదామని అంతర్జాతీయ ప్రసంగీకుడు బ్రదర్ అనిల్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఏసు క్రీస్తు ఆశీర్వాద పండుగల సువార్త సభల్లో మంగళవారం ఆయన ప్రసంగించారు. దేవుడి ప్రేమ మాధుర్యాన్ని విశ్వాసులకు వివరించారు.

అన్నసమారాధనకు విరాళం

పెనమలూరు: అయ్యప్పస్వామి అన్నసమారాధనకు ఎన్నారైలు విరాళం అందజేశారు. పెనమలూరు గ్రామంలో చాలా ఏళ్లుగా నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి అన్నసమారాధన ఈ ఏడాది జనవరి 29 ఆదివారం గ్రామంలో భారీ ఎత్తున జరుపుతున్నారు. ఈ కార్యక్రమం కోసం అమెరికాలో ఉన్న ఎన్నారైలు రూ. 1,61,482 విరాళాన్ని నిర్వహకులకు మంగళవారం అందజేశారని తానా మీడియా కోఆర్డినేటర్ ఠాగూర్‌మల్లినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ప్రతినిధులు కిలారు ప్రవీణ్, పాలడుగు సుధీర్, అయ్యప్పస్వామి అన్నసమారాధన కమిటీ సభ్యులు ముప్పాళ్ల పూర్ణచంద్రరావు, జాస్తి పూర్ణారావు, కిలారు బలరామయ్య, పరుచూరి రఘు పలువురు పాల్గొన్నారు.


పెనమలూరులో అన్నసమారాధనకు విరాళం అందజేస్తున్న ఎన్నారై ప్రతినిధులు